# ఈ ధర్మ గంట మోగదు

అదిగో, అదిగో, బండి, బండి-పాటలాగ పాడుతూ దొడ్డి- గుమ్మం వైపు పరుగుతీసింది -రజిత. ఎందుకంత ఉత్సాహం ఆ బండిని చూస్తే! - ప్లాస్టిక్ సంచీలో నింపిన చెత్త కింద పడకుండా జాగ్రత్తగా పట్టుకుంది.

"హాయిగావుంది నాకు, ఆ చెత్త కుండీ దారే నడిచివెళ్లి, అక్కడ అదంతా దిమ్మరించి, ఆ ఈగలు, దోమలు ముఖాన పడకుండా తప్పించుకొచ్చే గొడవ పోయింది."

రజిత పంపు దగ్గర చేతులు కడుక్కుంటూ అటూ, ఇటూ చూసి బాత్ రూములో సబ్బుతో ముఖం కూడా గబగబా కడుక్కుని, పరికిణీతో ముఖం, చేతులు తుడిచేసుకుంది.

మహాలక్ష్మమ్మకీ హాయిగానే వుంది, చెత్తబండి రావటం, రజిత ప్లాస్టిక్ కవర్లో చెత్త బయటపడేసి రావటం, అంతకు ముందున్న సత్తి చెత్త బయటపోయడానికి రోజూ గోల చేసేది. అది చేతికి వాచీ, జుట్టుకి రబ్బరు బాండ్ పెట్టుకునేది...ఏదో వంకని అద్దం ముందు నిలబడి ముఖం చూసుకుంటూవుండేది. ఓ రోజు ఉన్నట్టుండి. "ఇక నేను చెత్త బయట పొయ్యను" అంటూ రబ్బరు బాండ్ జుట్టుకి పెట్టుకుంది.

మహాలక్ష్మమ్మ విస్తుపోయింది ఓ క్షణం. అంతలో గొంతు దాకా కోపమొచ్చింది. "దీనికి షోకు లెక్కువయిపోయాయి. చెత్త బయట పోయదట - ఎంత పోగరో - ధాన్ని మాన్పించి పారేస్తా, రోగం కుదురుతుంది!" అనుకుంటూంటేనే, సత్తి ఎత్తయిన చెప్పులు వేసుకుని బయట కెళ్లిపోయింది.

మిగిలిన అన్నం, కూరలు పట్టికెళ్లటం సత్తికి ఇష్టం వుండదు. పని మనిషులందరూ తెచ్చుకునేలా గిన్నె తెచ్చుకోదు. ప్లాస్టిక్ కవర్లో ఎప్పుడైనా ఏ పదార్థమైన తీసికెళ్లినా, ఆ ప్లాస్టిక్ కవరు బుట్టలో పెట్టి ఆ బుట్టపట్టుకెడు తుందంతే - ఆ సత్తి అంటే మహాలక్ష్మమ్మకి చిరాకే, కానీ మరో మనిషి కుదరాలిగా!

ఆ రోజు సత్తి ఆ మాట అనగానే, రేపటి నుంచి ఏం చేయాలో తోచలేదు మహాలక్ష్మమ్మకి.

"ఒరేయ్ బాబీ, చూశావా, చెత్త బయటపొయ్యనని ఎంత పొగరుగా చెప్పిందో అది!" అంది, గదిలో చదువుకుంటున్న కొడుకుతో, "వినవేం?" అంది రెట్టించి "ఏమిటీ?" - బాబీ పుస్తకం అలానే వుంచి, నోట్లో పెన్నుపెట్టుకుని అన్నాడు.

తల్లి చెప్పింది. "సరే, నేను చేస్తాను, ఏముంది ఇందులో?" నూనూగుమీసాల నూత్నయౌవనంలో వున్న బాబీ తల్లికేసి చూసి, నవ్వుతూ, "పతి తులార, భ్రష్టులార, బాధాసర్పద్ర ష్టలార, ఏడువకండేడవకండి" - అంటూ గట్టిగా అనేసరికి, తల్లి చిరాగ్గా, "నే చెప్పిదేమిటీ, ఈ గోలేమిటి - కాలేజి పుస్తకాలు తప్ప తక్కినవన్నీ చదవటం మానేస్తే కానీ... "- పిల్లాడు ఎం. సెట్. శ్రద్ధగా చదవకుండా, స్నేహితులతో తిరుగుతున్నాడని పెద్ద బెంగ తల్లికి.

"మమ్మీ, చెత్తబుట్ట ఎవరు బయట పోస్తే ఏమిటి - నేను చేస్తా ఆ పని - నువ్వు ఖంగా రుపడకు" మళ్లీ పుస్తకంలో తల దూర్చాడు.

తల్లి మొత్తుకుని, "వీడేం చేస్తాడు, వీడి మొఖం! మరో పనిపిల్లని చూడాలి, అంతే!" అనుకుంటూ వంటింట్లో కెళ్లిపోయింది.

నాలుగు రోజులయ్యాక, సత్తి ఎల్లయ్యని వెంటబెట్టుకొచ్చింది. ఈ ఎల్లయ్య ఆ సందు చివర దాకా వెళ్లి చెత్తకుండీలో పారబోస్తాడని, దానికి ఎల్లయ్యకి నెలకి ముప్పై రూపాయలియ్యాలనీ చెప్పింది. సత్తి, గబగబా అంట్లు తోముతూ.

"అది నీ పనేగా! మళ్లీ ముప్పై రూపాయలు వాడికియ్యాలా?" అరిచింది ఇల్లాలు.

"ఇయ్యకండి - మీరే పారపోసుకురండి" అంది, బయటకెడుతూ, చెట్టునున్న మందారపువ్వు కోసి జడలో పెట్టుకుంటూ.

"ఎంత తెలివో చూశావురా దానికి?" అంది తల్లి, పేపరు చూస్తున్న కొడుకుతో "తెలివేమిటీ -

పాపం, ఎల్లయ్య రిక్షా తొక్కలేకపోతున్నాడు, ముసలాడికి చిన్న సాయం చేస్తోంది. వెరీ గుడ్. మంచిదేగా!" అన్నాడు చాలా ప్రశాంతంగా బాబి.

ఎల్లయ్యకి ఎవరూ లేరు. వీధులూడ్చే పోచమ్మే, వాణ్ని కనిపెట్టి చూస్తుంది. ఎల్లయ్యకి జ్వరమొస్తే పోచమ్మే డాక్టరు దగ్గరకి తీసుకెడుతుంది. అలా తనకన్నా బీదవాణ్ని పోచమ్మ ఆదరించటం వింటున్న బాబికి చాలా ఆనందంగా వుంటుంది. మనసులో అటు వస్తూ, ఇటు వస్తూ, ఐదు రూపాయలో, పది రూపాయలో పోచమ్మకి, ఎల్లయ్యకి ఇస్తూ వుంటాడు బాబి.

మహాలక్ష్మమ్మ ముప్పయి రూపాయలు ఎల్లయ్యకి ఇయ్యాలని ముందు బాధ పడినా, రోజూ సత్తి గోల తప్పిందనిపించి సద్దుకుంది.

ఆ నెలలో వారం రోజులు ఎల్లయ్య రాలేదు. 'జీతం యివ్వాలి వారం రోజులు డబ్బు కట్టుకుంటే కానీ వీడికి బుద్ధి రాదు' అనుకుంది మహాలక్ష్మమ్మ. కానీ, తల్లితో పని లేకుండానే, "ఎల్లయ్య నెల జీతం యిచ్చెయి" అన్నాడు.

"నెల జీతమేమిటీ?" అంది తల్లి.

బాబి ఏమీ అనకుండా ఎల్లయ్య నెల జీతం తెచ్చివాడి చేతిలో పెట్టాడు. "పాపం వాడి కసలే కాలు నొప్పి" అన్నాడు తల్లి వినేలా.

రెండు నెలలయ్యాక సత్తి పని మానేసింది. మహాలక్ష్మమ్మ ఇంట్లో పనులు చేసుకోలేక బడలిక పడిపోతోంది. ఎల్లయ్య నెమ్మదిగా అడుగులో అడుగేస్తూ చెత్తబుట్ట పట్టుకెడుతున్నాడు.

ఆ రోజు వీధిలో మహాలక్ష్మమ్మ నిలబడి కూరలు కొంటోంది. రెండు రోజులై వచ్చిన కొత్తపనిమనిషి అమ్మగారి పక్కనే నిలబడింది. ఓ ఇరవై ఏళ్ల కుర్రాడు మహాలక్ష్మమ్మ పక్కకొచ్చాడు. నెమ్మదిగా మాట్లాడాడు. ఆ కుర్రాడు చెప్పిన మాటలు మహా నచ్చాయి వాడికయితే ముప్పై, వీడికి పదిహేనేనట, పైగా ప్లాస్టిక్ కవరులో వేస్తే చాలు, ఇలా వచ్చి అలా తీసికెళ్లిపోతాడు, అయినా ఎల్లయ్య ముసలాడయిపోయాడు. ఏదో వంకతో అస్తమానం మానేస్తున్నాడు. ఎల్లయ్యని మాన్పించేయాలని నిశ్చయించుకుంది తక్షణం. ఆ కుర్రాడు ఆ దగ్గరున్న అందరిళ్లలోకీ వెళ్లాడు.

"ఈ బండి బాగుందమ్మగారూ. నాకు కూడా ఆ పని తప్పిపోయింది" అంటూ సంబరపడిపోయింది రజిత.

వారం రోజులుగా ముసురు. అయితేనేం, బండి వస్తూనే వుంది. మహాలక్ష్మమ్మ, రజిత కూడా ఆనందంగా వున్నారు.

ఆ రోజు రాత్రంతా ఎదురుచూస్తోంది, పోచమ్మ ఎల్లయ్య కోసం రాడే... ఎక్కడికి పోయాడూ... ఏ కారు కిందన్నా పడ్డాడా - ఏమో! పోచమ్మ ఆ వానలో అటు ఇటూ వెళ్లి వెతికింది.

రెండో రోజు సాయంత్రం ఎల్లయ్య కాళ్ళీడ్చుకుంటూ వచ్చాడు. ఎల్లమ్మ పోచమ్మ కన్నీళ్లాగలేదు. "ఓ అమ్మ ఇంత అన్నం పడేస్తే, తిని ఆ గుడి వెనుక పడుకున్నాను. అన్నాడు. ఒళ్లు జరంతో కాలిపోతోంది. ఆనాడు నీ భార్య నిన్నొదిలి వెళ్లిపోయిన దగ్గర నుంచీ, నిన్ను అన్న లెక్క చూసుకోటం లేదా - ఎల్లన్న, నా బిడ్డల్లో నువ్వొ ఒకడివి - అయినా, ముసలిజీవి, ఎంత తింటావు నువ్వు - ఎక్కడికి పోకన్నా!" పోచమ్మ ఎల్లయ్యని గుమ్మంలో కూచోబెట్టి, మంచి నీళ్లు నోటి కందించింది.

పదిహేను రోజులు కాంప్‌కి వెళ్లి తిరిగొచ్చాడు బాబి. ఇల్లంతా ప్రశాంతంగావుంది. తల్లి టీవీలో సీరియల్ చూస్తోంది. కొత్త పనిమనిషి అమ్మగారి సోఫా పక్కన కూచుని టీవీకి కళ్లప్పగించింది. అంతలో, వీధిలో విజిల్ వినిపించింది.

గబుక్కున లేచి "బండొచ్చిందీ?" దొడ్డి గుమ్మంవైపు పరుగుతీసింది రజిత 'ఏమిటి హడావిడి' అన్నాడు బాబి తల్లి వంక చూస్తూ.

"ఎల్లయ్య పీడ విరగడైందీ!" అంది.

"చచ్చిపోయాడా?" అన్నాడు ఒక్కసారిగా బాబి.

'అబ్బే - ఈ మధ్య చెత్త పట్టుకెళ్లే బండి వస్తోంది. ఇంటింటికీ హాయిగా వుందనుకో - పైగా వాడికి నెలకి ముప్పై, వీడికి పదిహేనే" అంది మళ్లీ టీవీ వైపు చూస్తూ మహాలక్ష్మమ్మ.

"పాపం, ఆ ఎల్లయ్యకి ఆ నాలుగు డబ్బులూ రావన్నమాట ఇక - ఎలా బతుకుతాడూ? మమ్మీ పాపం, ఎల్లయ్యకి రోజూ ఇంత అన్నం పెడదాం మనం.'

తల్లి ఫక్కున నవ్వింది - "ఇంకా నయం, ముసలాడు చేయలేకపోతున్నాడు పని, ఎప్పుడు కింద పడతాడోననే భయమే. పని చేయకుండా తిండి పెట్టడ మేమిట్రా - నాకు మాత్రం ఈ బండి అరేంజ్‌మెంట్ హాయిగా వుంది బాబూ!" టి.వీ ముందునించి లేస్తూ మహాలక్ష్మమ్మ.

బాబి మాట్టాడలేదు. పుట్టినవాళ్లంతా వృద్ధులు కాక తప్పదు కదా. ఎవరూ జీవితాంతం సంపాదించరు కదా - అందులోనూ ఇలాటి వాళ్ల గతేమిటి - ఆ చిన్న మనసులో ఎంతో ఆవేదన క్షణాలలో నిండిపోయింది.

బాబి మనసులో నాల్గో క్లాసులో చదువుకున్న ధర్మగంట పాఠం గుర్తొచ్చింది. గాడిద చేత అన్ని బరువులూ మోయించిన చాకలి, ఆ గాడిద ముసలిదవగానే, ఏ పనీ చేయలేదు కనక తిండిపెట్టడం మానేశాడు. ఆకలితో అలమటించి పోయే గాడిద పక్షాన నిలబడి ఎవరు ఆ చాకలికి ధర్మంచెబుతారు? ముసలితనమూ ప్రకృతిధర్మమే, దాన్ని గౌరవించాలనే నీతి ఎవరు బోధిస్తారూ?

అందుకే ధర్మం చెప్పే రాజు వాకిట నిలబడింది గాడిద. ధర్మగంట మోగించింది.

"ముసలాడివి నువ్వేనా?" అన్నాడు రాజు నవ్వి గాడిద వంక చూస్తూ చాకలి దండించాడు రాజు.

బుద్ధి వచ్చిన చాకలి, గాడిదని ముసలితనంలో ప్రీతిగా ఆదరించి తిండి పెట్టాడు - ఓహో! ఎంత గొప్ప కథ!! ఈ కథ అమ్మకి చెప్పాలి, అందరికీ చెప్పాలి - వార్ధక్యం ఎవరికీ శాపం కాకూడదని మరీ చెప్పాలి - ఆ నూనూగు మీసాల నూత్నయౌవనుడిలో ధర్మజ్యోతి వెలుగుతూనేవుంది. ఆవేశంతో ఆ యువకుడు ఊగిపోయాడు. నిజమే, యువకులు పరిగెత్తాలి, వృద్ధులు పడిపోకుండా చూడాలి.

చిన్నప్పట్నుంచీ బాబీకి ఎల్లయ్య తెలుసు. రిక్షాతొక్కి తనని స్కూలుకి తీసుకువెళ్లే ఎల్లయ్య అంటే ఎంతో ఇష్టం బాబికి.

కాలం మారిందంటారు - నిజమే, రిక్షా పోయి ఆటో, కారు, మరొకటి వచ్చాయి. ఆముదం దీపాలు పోయి విద్యుద్దీపం వచ్చింది. టైపు మిషను పోయి కంప్యూటర్ వచ్చింది. - కానీ, మానవత్వం పోయి దానవత్వం వెలుస్తోందా? - మనిషిని మనిషిగా చూసే రోజులు పోతాయా ఇక - బాబి ఉడుకు రక్తం ఉరకలేస్తోంది.

"మమ్మీ, మమ్మీ!"

"ఏమిటీ?" మహాలక్ష్మమ్మ టీవీ వైపు నించి ముఖం తిప్పలేదు. బాబి టీవీ స్విచ్ ఆర్పేశాడు.

"ఏమిటో చెప్పు" - పక్కన పెళ్లెంలోవున్న మిక్స్చర్ నోట్లోపోసుకుంటూ అంది, మాహాలక్ష్మమ్మ.

"పాపం, ఎల్లయ్యని అందరూ మానిపించేస్తే - ఏదో అంటున్నాడు బాబి..."

'ఏమో, వాడి ఖర్మ వాడిది - అయినా నీకేమిటి అంత యిదీ?" అంది చిరాగ్గా.

బాబి అక్కడున్న బల్లను ఒక్క తన్ను తన్ని, బయటకు వెళ్లిపోయాడు.

పోచమ్మ గుమ్మంలో ఆగింది బాబి స్కూటరు. ఎల్లయ్యని ఆస్పత్రిలో చేర్పించిందట - జ్వరం తగ్గిందట. రేపు ఇంటికి తెస్తుందట - పోచమ్మ ఈ మాటలు చెప్పేసరికి గజగజ వణికిపోతున్నాడయ్యా, పాపం, అంది చిన్న గాజుగ్లాసులో టీ తెచ్చి బాబీకి ఇస్తూ.

తనేం సహాయం చేయలేడా - ఎల్లయ్య జ్వరం తగ్గాక అమ్మని ఎలాగో ఒప్పించి, రోజూ వాడికి రెండు పూట్లా అన్నం పెట్టేట్టు చేస్తాను... ఆ పాటి చేయలేనా? - తల్లి ఒప్పుకోదు అయినా, ఒప్పిస్తా - ఒక్కసారి మహాకవి గేయం ఆ చిన్న గుండెల్లో కదిలింది 'నేను సైతం... ఒక్క ప్రాణిని రక్షించినా, బతికించినా చాలు కదా!!

బాబికి తను స్కూలుకెళ్లే రోజుల్లో ఎల్లయ్య రిక్షాతొక్కటం, ఆ రోజు జరిగిన సంఘటన గుర్తొచ్చాయి. పిల్లలంతా బిలబిలా బైటికొచ్చారు. బాబీ కూడా వచ్చాడు. అందరూ తోసుకుంటూ ఐస్ ఫ్రూట్ బండి దగ్గరున్నారు. బాబి బిక్కముఖం వేసుకు ఓ మూల నిలబడ్డాడు ఏడుపొచ్చింది. చొక్కాతో కళ్లు తుడుచుకున్నాడు. అమ్మ డబ్బులివ్వదు - అలాంటివి తింటే జబ్బు చేస్తుందంటుంది. ఇంట్లో నేను ఐస్ క్రీమ్ చేసి పెడతాగా అంటుంది - ఛీ, అయినా, ఇంతమందికి రాని జ్వరం

తనకెందుకొస్తుందీ అంటే, వీళ్లు వేరు, నువ్వువేరు అంటుంది ఏమిటో - బాబికి ఏడుపు గొంతుదాటి వచ్చేస్తోంది.

రిక్షాలోవున్న ఎల్లయ్య పిల్లాడిని కనిపెడుతున్నాడు. “ఐస్ ఫ్రూట్ తింటారా బాబూ?” అన్నాడు.

బాబి ముఖం నిండా ఆనందమే. “కానీ డబ్బులు...?”

“నా దగ్గరున్నాయిగా!” ఎల్లయ్య పుల్లకి పెట్టిన ఎర్రని ఐస్ ఫ్రూట్ తెచ్చాడు. “అమ్మగారితో చెప్పను బాబూ, హాయిగా తినండి.”

బాబి కళ్లు తుడుచుకున్నాడు. ఆ తర్వాత ఎల్లయ్య ఎన్ని సార్లు స్కూలు దగ్గర జామపళ్లు, తేగలు, ఐస్ ఫ్రూట్ కొనిచ్చాడో బాబి ఎలా మర్చిపోతాడూ!? ఆ ఎల్లయ్యే ఈ నాటికీ బాబి మనసులో వున్న ఎల్లయ్య!!.

చలి బాగా ఎక్కువైంది. ఓ రోజు కొత్త దుప్పటి తీసి జాగ్రత్తగా సంచీలో మడతపెట్టి పెడుతున్నాడు బాబి.

వంటింట్లో నించి బయటకొచ్చిన తల్లి గమనిస్తోంది. “ఎక్కడికీ?” అంది, ఆ సంచీ వంక చూస్తూ.

బాబి భయపడలేదు. “ఎల్లయ్య దగ్గరికి” అన్నాడు సంచీ పట్టుకుంటూ.

“ఏమిటీ, కొత్త దుప్పటి వాడికిస్తావా? నీకేదో పిచ్చి పట్టింది. ఇలా ఇల్లంతా దోచి, వాడి ముఖాన పెడుతున్నావన్నమాట!” అంటూ “ఇంటియ్యి!” అని లాక్కోబోయింది.

తల్లి మీద కోపం కట్టలు తెంచుకుంది బాబికి. “ఇది నువ్వు లాక్కుని దాచేస్తే ఇప్పుడే వెళ్లి మరోటి కొనుక్కొస్తా, ఇది ఎల్లయ్యకి ఇచ్చి వచ్చాక నీకు ధర్మగంట కథ చెప్తా” అంటూ, తల్లిచేతిలోంచి ఆ సంచీ లాక్కుని, స్కూటర్ మీద వెళ్లిపోయాడు బాబి.

“తండ్రి, సౌదీ వెళ్లి సంపాదించిదంతా వీడిలా దానధర్మాలకి తగలేస్తే సరి - అయినా, ఈ పిల్లాడిని నేను నా దారికి తేనేను - ఆయనకి ఫోన్ చేసి, వీడి సంగతంతా చెప్తా... అబ్బో, ఇలాగయితే ఎలా’... మహాలక్ష్మమ్మ ఆ పిల్లాడిని ఆపలేక, టీవీ రిమోట్ చేత్తోపట్టుకుని సోఫాలో కూలబడింది.

“అయినా ఇంత ధర్మబుద్ధి వీడికెలా వచ్చిందో, ఆ స్నేహితులు ఇలా పక్కదారి పట్టించేస్తారంతే - ఏమన్నా కానీ, ఆ తండ్రికి వీడి విషయం చెప్తేకానీ, వీడి పద్ధతి దారికి రాదు. నాకు చెప్తాడట కథ - ధర్మగంట!!” మహాలక్ష్మమ్మ కొడుకు పూర్తిగా పాడయిపోతున్నాడని చాలా బాధపడిపోయింది.

ఓ గంట అయ్యేసరికి స్కూటర్ వీధిలో ఆగిన చప్పుడుకి తలెత్తింది. మహాలక్ష్మమ్మ.

"ఇదిగో నీ దుప్పటి, దాచుకో, ఇక ధర్మగంట మోగదు" - అంటూ ఆ సంచీలోంచి కొత్త దుప్పటి తీసి తల్లికిచ్చి, గదిలోకెళ్లి తలుపేసుకున్నాడు బాబి.

ఆ నాడు ఐస్ ఫ్రూట్ కొనిచ్చిన ఎల్లయ్య కళ్ల ముందు కదులుతుంటే, బూడిద రాశిని ఊహించుకుంటూ కళ్లు గట్టిగా మూసుకున్నాడు బాబి.

- ఆంధ్రప్రభ ఆదివారం 27 జూన్ 2004